ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ అక్టోబర్ 11(వాయిస్ టుడే): పెద్దపల్లి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ కోరారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, డిసిపి వైభవ్ గైక్వాడ్ లతో కలిసి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు 24 గంటల పాటు నమోదు చేయవచ్చని తెలిపారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లాలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సి-విజల్ యాప్ లో నమోదైన ఫిర్యాదులను 100 నిమిషాలలో పరిష్కరించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున ప్రస్తుతం ఉన్న పనులు, పథకాలు మాత్రమే కొనసాగుతాయని కొత్త పనులు, పథకాలు ప్రారంభించడం జరగదని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. రాజకీయ పార్టీలకు నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, సువిధా యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని , రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించవద్దని ఎన్నికల అధికారి తెలిపారు.

మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయడం, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123, ఐపిసి సెక్షన్ 171 ప్రకారం అభ్యర్థులపై 6 సంవత్సరాలు నిషేదం ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. అక్టోబర్ 30 వరకు నూతన ఓటరు నమోదు కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఓటరు జాబితాలో పేర్లు లేకుండా ఎవరైనా అర్హులైన ఓటర్లు ఉంటే వెంటనే దరఖాస్తు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, 24 గంటల్లోగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామని అన్నారు. ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో ఎక్కువమంది సమావేశాలు నిర్వహణకు పోటీ పడితే ముందు దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పిస్తామని అన్నారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వివిఐపి లు, విఐపి ల పర్యటన సమయంలో స్థానిక పోలీస్ అధికారులతో పార్టీ నాయకులు సమన్వయం తో పనిచేయాలని, ప్రజలకు, ముఖ్యఅతిథులకుఇబ్బందులు కలగకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో విద్వేషాలను పెంచే విధంగా పోస్టులు పెట్టడం,ఇతరులను దూషించడం, బెదిరింపులకు గురి చేయడం వంటివి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ఈ సమావేశంలో ఏసీపీలు ఎడ్ల మహేష్, శ్రీనివాస్ రావు, సి.ఐ. అనిల్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీలో చేరిక

వాయిస్ టుడే, జడ్చర్ల : నవాబుపేట్ మండలంలోని పోమాల్ గ్రామానికి చెందిన 25 మంది యువకులు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి బుధవారం మాజీ మంత్రి వర్యులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ,సమక్షంలో జడ్చర్ల బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి. ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి , మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

ఇల్లందులో నవంబర్1వ తేదీన సీఎం కెసిఆర్ పాల్గొనే భారీ బహిరంగ సభ

హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి : ఎంపీ మాలోత్ కవిత

ఇల్లందు అక్టోబర్ 11 (వాయిస్ టుడే): ఇల్లందు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే హరిప్రియ నాయక్. ఎంపీ మాలోత్ కవిత ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. రానున్న ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యేగా హరిప్రియ నాయక్ గెలుపును కాంక్షిస్తూ, నవంబర్ ఒకటో తారీఖున ఇల్లందులో జరగబోయే సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరారు, ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధిని గత నాలుగున్నర సంవత్సరాలలో చేసి చూపించిన హరిప్రియ నాయకులనాయకు మీ అమూల్యమైన ఓటు వేసి మరల ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపించవలసిందిగా ప్రజలను కోరారు, ఇల్లందు నియోజకవర్గంలోని యువకులు, యువకులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి ఇల్లందులో జరగబోయే సీఎం భారీ బహిరంగ సభను జయప్రదం చేయవలసిందిగా ఈ సందర్భంగా వారు కోరారు.. ఈ కార్యక్రమంలో. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, జెకె శ్రీనివాస్ మనోహర్ తివాడి, సుదీర్ తోట్ల, బొమ్మెర వరప్రసాద్ లక్ష్మణ్ నాయక్ తాత గణేష్ ఆంతోటి అచ్చయ్య కంభంపాటి రేణుక శీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు..

కాంగ్రెస్ పార్టీ లో చేరికల జోరు

నర్సంపేట(వాయిస్ టుడే): అభివృద్ధి అంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని నమ్మి నర్సంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ మెంబర్ దొంతి మాధవ రెడ్డి సమక్షంలో దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామం నుంచి చౌదారపు రాజు, జట్టబోయిన రవి, మాచర్ల వెంకటయ్య, కొలిపాక కుమారస్వామి, సోనబోయిన రాజు, సంకటి, మల్లయ్య, మంద రమేష్, దండు సారంగం , పోశాల నాగరాజు ,పలువురు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి ,దుగ్గొండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రల బాబు, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరు కిరణ్ రెడ్డి, ఒలిగే నర్సింగరావు, తిమ్మంపేట గ్రామ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జనంతో జన సేన ప్రజా బాట

నియోజకవర్గ ఇన్చార్జ్ మెరుగు శివకోటి యాదవ్

నర్సంపేట(వాయిస్ టుడే): అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ నర్సంపేట నియోజవర్గంలో పోటీ చేస్తున్న తరుణంలో ప్రచారంలో భాగంగా చెన్నారావుపేట మండల కేంద్రంలో ప్రధాన కార్యదర్శి గాండ్ల అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సంపేట నియోజవర్గ ఇంచార్జ్ మేరుగు. శివకోటి యాదవ్ పాల్గొని ప్రజలకు జనసేన పార్టీ సిద్ధాంతాలను, తమ అధినేత అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నియోజవర్గంలో చేసినటువంటి ప్రజాసేవ,పోరాట కార్యక్రమాలను వివరించి, జనసేన పార్టీ సామాన్యుల కోసం పుట్టిందని సామాన్యులకు అండగా ఉంటుందని అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వంగ మధు ఓర్సు రాజేందర్,కుండె రాజ్ కుమార్, సాయి ఈశ్వర్, ఎలబోయిన డేవిడ్, బొబ్బ పృద్వి రాజ్, కిరణ్,అభిషేక్, రాకేష్ పాల్గొన్నారు

కుట్టు మిషన్‌ల పేరుతో రాజకీయం తగదు

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ

నర్సంపేట (వాయిస్ టుడే): కుట్టుమిషన్ ల పేరుతో అధికార పార్టి రాజకీయం చేయడం తగదని వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంటూరుపల్లి సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ అన్నారు. కెఎన్ఆర్ అనే స్వచ్ఛంద సంస్థ కుట్టు మిషన్లను పంపిణి చేయగా అవి అధికార పార్టి నాయకుల సొంత డబ్బులతో ఇచ్చినట్టు గొప్పలు చెప్పుకున్నారని రాబోయే ఎన్నికలలో ఓటమి భయం పట్టుకొని ఇలాంటి కార్యక్రమాలకు తెరతీస్తున్నారని పార్వతమ్మ తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ ఇస్లావత్ పద్మ భాయ్ నర్సంపేట పట్టణ అధ్యక్షులు నూనె పద్మ మరియు మహిళ నాయకులు పాల్గొన్నారు

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

వరంగల్ (తూర్పు) అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి/బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్ భాషా..

గ్రేటర్ వరంగల్, అక్టోబర్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి) ఎన్నికల నిర్వహణ లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని వరంగల్(తూర్పు) అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి/బల్దియా కమీషనర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో వరంగల్ (తూర్పు) అసెంబ్లీ నియోజకవర్గ పరిధికి సంబంధించి సెక్టోరల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదని, ఒక సెక్టోరల్ అధికారి పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలు ఉండే అవకాశం ఉందని, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పి.డబ్ల్యు.డి. ఓటర్లకు ర్యాంపుల ఏర్పాటు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్, ఫ్యాన్లు, పోలింగ్ కేంద్రంలో ఏవైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే వెంటనే పూర్తి చేసి అన్ని వసతులను పరిశీలించి సంబంధిత ఫార్మాట్లో వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు జరిగే వారం ముందు నుండి సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సిబ్బందిని తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడం, రిజర్వు ఈవిఎం అందుబాటులో ఉంచుకోవడం, ఎన్నికల రోజున కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసిల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం ప్రతి పోలింగ్ కేంద్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

మేడారం సమ్మక్క సారక్కలను దర్శించుకొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వరంగల్ (వాయిస్ టుడే): ములుగు జిల్లాకు ప్రధాని నరేంద్ర మోడీ సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరుపున బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు కిషన్ రెడ్డి , జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ , మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు తో కలిసి బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మేడారం సమ్మక్క సారక్కలను బుధవారం నాడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు తెలంగాణ యువతకు పెద్దపీట వేయనుందని, ఇది గిరిజన సంస్కృతిపై లోతైన అవగాహన కల్పించడంతో పాటు ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందన్నారు. ములుగులో 'సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం'గా పేరు పెట్టడాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతించారని తెలిపారు. క్రొత్త విశ్వవిద్యాలయం రాష్ట్రం లో ఉన్నత విద్య అవకాశాల ను పెంపు చేస్తుందని చెప్పారు. ఉన్నత విద్య నాణ్యత ను మెరుగు పరచడం మాత్రమే కాకుండా ఉన్నత విద్య ను అందుకొనే దారుల ను విస్తరిస్తుందన్నారు. ప్రాంతీయ అసమానతల ను తొలగించడానికి కూడాను పాడుపడుతుందన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక తెలంగాణలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దాదాపు ప్రతీ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్నదన్నారు. ప్రజలు నరేంద్ర మోడీ పాలనకు ఆకర్షితులవున్నారని, ఈ సారి ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి జెండా ఎగురవేయటం కాయమన్నారు. బిఆర్ఎస్ కుటుంబ పాలనపై ప్రజలు విసుగుచెందారని, వారికి ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోరంటాల గ్రామంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించిన జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ

గంభీరావుపేట వాయిస్ టుడే ప్రతినిధి : ఈనెల 17వ తేదీన రాజన్న సిరిసిల్లలో ఎన్నికల శంఖారావం పూరించడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ వస్తున్న సందర్భంగా బారి ఎత్తున జన సమీకరణ చెయ్యాలనే ఉద్దేశంతో ఇంటింటికి వెళ్లి ఆడపడుచులకు బొట్టు పెట్టి సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించడం జరిగింది. భారీ మెజార్టీతో కే టి ఆర్ ను గెల్పించుకొని ముఖ్యమంత్రి కె సి ఆర్ కు బహుమతి ఇవ్వాలని ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ ,సర్పంచ్ అంజమ్మ ,ఉప సర్పంచ్ బాల్ రెడ్డి ఎంపీటీసీ ఎర్రం అంజిరెడ్డి గ్రామాశాఖ అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో అంగన్వాడీ కేంద్రంలో దొంగతనం

దుబ్బాక (వాయిస్ టుడే ప్రతినిధి) అక్టోబర్ 11, సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గత రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి అంగన్వాడి కేంద్రం కు చోరీకి పాల్పడ్డారు రోజు మాదిరిగానే అంగన్వాడీ కేంద్రానికి తాళాలు వేసి వెళ్లడం జరిగిందని అంగన్వాడీ టీచర్ రేణుక తెలిపారు అయితే ఈరోజు ఉదయం పాఠశాల తెరవడానికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉందన్నారు వెంటనే అంగన్వాడీ కేంద్రంలోకి వెళ్లి చూసేసరికి చిన్నారులకు సంబంధించిన గుడ్లు పాలు పప్పులతో పాటు ప్లేట్లు గ్లాసులు దొంగలు ఎత్తుకెళ్లారని గ్రహించారు వెంటనే స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం అందజేయడం జరిగిందన్నారు అంగన్వాడీ కేంద్రంలో చోరీ విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు చోరీకి పాల్పడిన దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుబ్బాక పట్టణంలో గడ్డి మందు తాగి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య

దుబ్బాక (వాయిస్ టుడే ప్రతినిధి) అక్టోబర్ 11, సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన ఏం మంజ అనే యువకుడు, రమేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు ఇతని వయసు 48 సంవత్సరాలు ఉన్నప్పటికీని ఇంతవరకు పెళ్లి కాలేదని మానసికంగా కృంగిపోయేవాడు అంతేకాకుండా గత రెండు సంవత్సరాలుగా పక్షవాతం వచ్చి మరింత మానసికంగా బాధపడుతూ ఈ బ్రతకడం కంటే చావడం నయం అని అప్పుడప్పుడు కుటుంబ సభ్యులతో చెప్పేవాడు అంటున్నారు ఈరోజు మధ్యాహ్నం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక SI గంగరాజు తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ గా ఆరెపల్లి రాకేష్

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ అక్టోబర్11(వాయిస్ టుడే): సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణం సుభాష్ నగర్ కు చెందిన ఆరేపల్లి రాకేష్ ను భారత రాష్ట్ర సమితి ఎస్సీ సెల్ పెద్దపల్లి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గా నియమించడం జరిగింది, అనంతరం నూతనంగా నియామకమైన ఆరేపల్లి రాకేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు పదవి బాధ్యతలు స్వీకరించిన టిఆర్ఎస్ పార్టీకి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు, నూతనంగా ఎన్నిక చేసిన పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కి రుణపడి ఉంటాను తెలిపారు, నియామకానికి సహకరించిన ఎంపీపీ బాలాజీ రావు మండల పార్టీ అధ్యక్షులు పురం ప్రేమ్చందర్రావు ల కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు, ఆరెపల్లి రాకేష్ నియామకం పట్ల మండలంలోని పలువులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ జి ఎఫ్ రగ్బీ పోటీలలో కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ అక్టోబర్11(వాయిస్ టుడే): ఆదివారం జరిగిన అంబేద్కర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లాలో ఎస్ జి ఎఫ్ రగ్బీ అండర్ పదిహేడు విభాగంలో పోటీలలో సుల్తానాబాద్ కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు బాలికల విభాగంలో అమృత వర్షిని ఎస్. నాయర్, పి. జాహ్నవి, టి. సాయి వీక్షిత, ఎస్. శాంతి ప్రియ, ఎన్. జ్యోతి, కె. సృజన, బాలురల విభాగంలో ఎ. రిషిక్, పి. సాయి తారక్, బి. శరత్, వి. అనిరుద్, జి. యశ్వంత్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల పన్నెండు పదమూడు పద్నాలుగు తేదిలలో జరిగే మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కరీంనగర్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థుల ఎంపిక పట్ల కేరళ మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ సిజ్జు. ఎస్. నాయర్, స్మిత. ఎస్. నాయర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ. అజయ్ కుమార్ పాఠశాల అధ్యాపక సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందించారు..

ఇసుక క్వారికి అక్రమంగా తరలిస్తున్న మట్టి

పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్, అక్టోబర్11(వాయిస్ టుడే) మండలంలో ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు అక్రమ దారులకు వరాలుగా మారుతున్నాయి. సుల్తానాబాద్ మండలంలోని గట్టిపల్లి శివారులో ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ దారులు ఏదేచ్ఛగా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు గతంలో అనేక సార్లు ఈ ప్రాంతం నుండి మట్టి తరలించడంతో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి జెసిబి లు ట్రాక్టర్లను తాసిల్దార్ కార్యాలయానికి తరలించి వేలాది రూపాయల జరిమానాలు విధించిన అక్రమార్కులలో మార్పు రావడం లేదు శని ఆదివారాలు పండుగ దినాలు ప్రభుత్వ కార్యాలయానికి సెలవు రావడమే తరువాయి అక్రమార్కులు ఈ స్థలంలో తమ జెసిబి ట్రాక్టర్లతో వాలి వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తూ పబ్బం గడుపుతున్నారు ప్రజా ప్రతినిధులు సైతం ఈ ప్రాంతం పైకన్నేసి వివిధ అవసరాల కోసం మట్టిని తరలించిన సందర్భాలు కో కొల్లలు ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని మట్టి తరలిస్తున్న అక్రమార్కులు వారికి సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని పలువురు మండల ప్రజలు కోరుతున్నారు.